సాక్షి
ప్రకాశం
ఆదివారం । 5 । మార్చి । 2023



గన్ లెక్క పక్కా
ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజుల్లో జిల్లాలోని లైసెన్స్‌డ్ గన్‌లు అన్నింటినీ తమకు అప్పగించాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 36 గన్‌లు ఉన్నాయి. - 8లో..



గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలి
గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 34 /20

వాతావరణం
గాలిలో తేమశాతం ఎక్కువ ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

8న మేలుకో కార్యక్రమం

ఒంగోలు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మేలుకో అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజా కళావేదిక కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవులు, రచయితలు పాల్గొనే ఈ కార్యక్రమంలో మహిళాభ్యుదయ పాటలు, మిమిక్రి, తాడేపల్లి వారిచే వెండి అంచు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దొనకొండ రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

దొనకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ వెల్లడించారు. శనివారం దొనకొండ రైల్వేస్టేషన్‌ను ఆయన పరిశీలించారు. స్టేషన్‌కు కావాల్సిన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. స్టేషన్‌లో ఆర్వో ప్లాంట్, ఏసీ హాలు, టాయిలెట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫాంపై ఉన్న షెడ్ పొడిగింపు వంటివి చేయాలని అధికారులకు సూచించారు. సిగ్నల్స్, డ్రైవర్లకు ఏర్పాటు చేసిన షెడ్లను డీఆర్‌ఎం పరిశీలించారు. పలువురు నాయకులు డీఆర్‌ఎంను సన్మానించారు.

8 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడురోజుల పాటు రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ ఆరుపండ్ల విభాగం, 9న న్యూ కేటగిరి విభాగం, 10న సీనియర్స్ విభాగం ఎడ్ల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9866432566 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఊరూర..

ఆరోగ్య రక్ష..


వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నమూనా

వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య రక్షణ విషయంలో మరో అడుగు ముందుకేశారు. మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పంచాయతీ స్థాయిలోనే ఆరోగ్య పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు సంబంధించి జిల్లా అధికారులు కసరత్తు ప్రారంభించారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పంచాయతీ స్థాయిలో ప్రతిఒక్కరి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28న జీవో ఎంఎస్ నంబర్-34ను విడుదల చేసింది. జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధన కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసే దిశగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సేవలు అందించేందుకు ఈ సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ...


జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి (ఎస్‌డీజీ) సాధన కోసం ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు కానుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం అధికారులు కమిటీలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో-మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్-ఎంఎల్‌హెచ్‌వో)ను టాస్క్‌ఫోర్స్ కమిటీకి లీడర్‌గా వ్యవహరించేలా రూపకల్పన చేయనున్నారు. ఆ కమిటీలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచర్, స్కూలు హెల్త్ అంబాసిడర్, గ్రామంలోని డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు కూడా ఉంటారు.

విధులు ఇలా...

- రక్తహీనత పర్యవేక్షణ, ప్రసూతి మహిళల ఆరోగ్యం, పిల్లల ఆరోగ్యం, జీవనశైలి, జబ్బుల నిర్ధారణ..వాటి నివారణ, చికిత్స తదితర ఆరోగ్య కార్యకలాపాలపై ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు, సభ్యులు కమిటీ లీడర్‌కు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ ఉంటారు.
- పాఠశాలల్లోని పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలపై పాఠశాలలోని హెల్త్ అంబాసిడర్ కూడా ఎప్పటికప్పుడు కమిటీ లీడర్‌కు సమాచారం అందించాలి. కౌమార దశలోని బాలికలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల్లో ఉన్న రక్తహీనతను పర్యవేక్షించడంతో పాటు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో సమన్వయం చేసుకోవాలి. రక్తహీనత కలిగిన కౌమార దశలోని బాలికలకు ప్రతిరోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. ఇతర పిల్లలకు పోషకాహారం అందించాలి.
- యుక్త వయసులోని బాలికలకు శానిటరీ నాప్కిన్స్ సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు మధ్యాహ్న భోజనాల వివరాలను కమిటీ లీడర్లకు అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు గ్రామాల్లో రక్తహీనతపై పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన మందుల పంపిణీ, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు సక్రమంగా అందేలా చూస్తూ టీం లీడర్‌తో సమన్వయం చేసుకోవాలి.
- గ్రామాల్లో జరిగే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీమ్ లీడర్ విధిగా హాజరయ్యేలా టీంలో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యులు వారి నివాస ప్రాంతాల్లో ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా? అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకోవాలి. గ్రూపు సభ్యులకు ఆయా ప్రాంతాల్లో జీవనశైలిని బట్టి జబ్బుల నివారణ, పరీక్షలు, చికిత్సలు లాంటి ఇతర అనారోగ్యకరమైన సమస్యలపై అవగాహన కల్పించాలి. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి.
- ప్రసవానికి ముందు యాంటినేటల్ పరీక్షల సమయంలో యూఎస్‌జీ స్కానింగ్ ప్రాముఖ్యత, ఇమ్యునైజేషన్ ద్వారా రోగ నిరోధకతను పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి.
- బాల్య వివాహాల నివారణ ద్వారా యుక్త వయస్సు గర్భాలను నిరోధించాలి.
- కుటుంబ నియంత్రణ ప్రణాళిక అమలు చేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌పై ఉంటుంది.

ప్రధాన ఆరోగ్య సమస్యలపై దృష్టి...

గ్రామం ఒక యూనిట్‌గా ఏర్పాటు కానున్న ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రధానంగా ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలి. ప్రతిరోజూ గ్రామంతో పాటు గ్రామ శివారునున్న పల్లెలు, తండాలు, గిరిజన గ్రామాల్లో అనారోగ్యకరమైన సమస్యలేమైనా తలెత్తాయా అని వాకబు చేస్తూ ఉండాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం లాంటి వాటిని గమనించాలి. అనారోగ్యాలకు సంబంధించి నివారణ చర్యలు, గ్రామాల్లో జీవనశైలి, జబ్బుల నివారణ, చికిత్సలపై ఈ టాస్క్‌ఫోర్స్ అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి.



పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశాం



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకున్న గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరిరక్షణ విషయంలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులను కూడా అప్రమత్తం చేశాం. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీకి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కూడా ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. సంపూర్ణ ఆరోగ్యం దిశగా గ్రామీణ ప్రాంతాలను తీర్చి దిద్దుతాం. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామ కమిటీలకు సహకరిస్తాం.

– జీవీ నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

ప్రజలకు ఎంతో ఉపయోగం

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్ ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్, తదితర అంశాలకు సంబంధించి ప్రజలకు క్రమంగా అవగాహన కల్పించడం జరుగుతుంది. దీని ద్వారా ప్రజలకు ఆరోగ్యం, అనారోగ్యంపై అవగాహన కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి కార్యక్రమాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతున్నాం.

– రాజ్యలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

వేసవికి ముందస్తు ప్రణాళిక

- నీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- సమస్యల పరిష్కారానికి కృషి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధికారులకు సూచించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన శనివారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, నెల్లూరు జిల్లా జేసీ, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వేసవి వచ్చినందున జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నారో వివరించాలని కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దాన్ ఆలీషేక్ మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాల్లో 78 ఆవాస ప్రాంతాల్లో రోజుకు 705 ట్రిప్పుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లకు సంబంధించి 99,206 కనెక్షన్ల లక్ష్యానికిగానూ 65,395 కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యపై పూర్తి స్థాయిలో చర్చ సాగింది. ఈ నెల 25వ తేదీ వరకు మాత్రమే సాగర్ నీరు విడుదల చేస్తున్న దృష్ట్యా.. చెరువులు నింపేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. 85/3 మైలు వద్దకు 3,300 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా, కేవలం 2 వేల క్యూసెక్కులు మాత్రమే వస్తోందని, ఫలితంగా తాగునీటి చెరువులు నింపడంలో సమస్య నెలకొందని అన్నారు. మరోవైపు సాగర్ ఆయకట్టు కింద కొమరోలు, తదితర మండలాల్లో మిర్చి, పత్తి, తదితర పంటలు సాగవుతున్నాయని, ఏప్రిల్ 15 వరకు నీటి విడుదల ఉండేలా ప్రభుత్వంతో చర్చించాలని కలెక్టర్లకు సూచించారు. దీనిపై ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందిస్తూ.. ఆర్‌డబ్ల్యూఎస్, తహసీల్దార్లు తాగునీటి చెరువులు నింపేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్‌శాఖలో గతేడాదికి – ప్రస్తుతానికి ఒక మిలియన్ యూనిట్ డిమాండ్ పెరుగుతుందని, అందుకు తగ్గట్లుగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ సత్యన్నారాయణ తెలిపారు. విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంచేందుకు 5 సంవత్సరాల కంటే ముందు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా కండక్టర్ వైరు మార్పు జరుగుతోందని, జిల్లాకు నూతనంగా రూ.980 కోట్లతో 70 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు కూడా పూర్తి చేస్తామని వివరించారు.

అధికారాలపై చర్చ...

సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు మాట్లాడుతూ అధికారులు తమ అధికారాలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. టంగుటూరు, కొరిశపాడు, ఇంకొల్లు, పామూరు మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీలు పలు ప్రశ్నలు లేవనెత్తారు. కనీసం తమను సమావేశాలకు కూడా ఆహ్వానించకపోవడం ఏమిటని మండిపడ్డారు. తమకు అధికారాలు ఉన్నాయా.. లేవా..? చెప్పాలన్నారు. రాజ్యాంగేతర శక్తులు తమ అధికారాలను అడ్డుకుంటున్నాయని, వాటికి అధికారులు వత్తాసు పలకడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు కలెక్టర్లు మాట్లాడుతూ జెడ్పీటీసీలకు సంపూర్ణ గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

అధికారుల తీరుపై ఆగ్రహం...

ఒక లైన్‌మెన్, కాంట్రాక్టర్ కలిసి గజ్జలకొండ ప్రాంతంలో రైతుల వద్ద నుంచి రూ.50 లక్షలకుపైగా వసూలు చేసి మోసం చేశారని, దీనిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు కూడా నిర్వహించడంతో పోలయ్య అనే లైన్‌మెన్‌ను సస్పెండ్ చేశారని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. కానీ, అదే లైన్‌మెన్‌కు తిరిగి అదే ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందని, ఇదెక్కడి విడ్డూరమని ప్రశ్నించడంతో దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్ కూడా సీరియస్ అయ్యారు. అదే ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చేకాడికి సస్పెండ్ చేయాల్సిన అవసరం ఏముందన్నారు. తక్షణమే సీఎండీతో మాట్లాడి పోస్టింగ్ మార్చాలని ఆదేశించారు. శానిటరీ వర్కర్లకు రెండున్నర సంవత్సరాలుగా జీతాలు రావడం లేదంటూ కారంచేడు జెడ్పీటీసీ తెలుపగా, ఈ నెలలో మొత్తం బకాయిలు క్లియర్ చేస్తున్నామని అధికారులు వివరించారు. ఓసీ మైనార్టీ మహిళను బీసీ బీ కోటా కింద అంగన్‌వాడీ టీచర్‌గా ఎలా నియమిస్తారంటూ తాము ప్రశ్నిస్తున్నా వినకుండా ఉత్తర్వులిచ్చారంటూ ఆమె చదువుకున్న పాఠశాల హెచ్ఎం ఇచ్చిన ధ్రువీకరణను జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి కలెక్టర్‌కు అందించారు. అదే విధంగా ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాలకు సంబంధించి ఆక్రమణకు గురైన భూమిని విడిపించాలని కోరారు. పీడీసీసీబీ చైర్మన్ మాదాసు వెంకయ్య మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో విద్యుత్ కండక్టర్ త్వరగా తుప్పు పడుతుందని, వాటిని మార్చి ప్రమాదాలను నివారించాలని కోరారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో హనుమంతరావు, జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణ రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.


పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

వైఎస్సార్ సీపీతో గుప్తాకు సంబంధం లేదు


మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

- టీడీపీ నేతలు రెచ్చగొట్టడం వలనే గుప్తా అడ్డదారులు
- 2014 నుంచే అతనిపై కేసులు
- ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్

ఒంగోలు: వైఎస్సార్ సీపీతో సోమిశెట్టి సుబ్బారావు గుప్తాకు ఎటువంటి సంబంధం లేదని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం కొందరు టీడీపీ నేతలు రెచ్చగొట్టడం వలనే గుప్తా అడ్డదారులు తొక్కుతున్నాడని అన్నారు. 2014 నుంచే అతనిపై అనేక కేసులు నమోదయ్యాయన్నారు. గుప్తా వ్యవహారశైలి కారణంగానే అతనిపై కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని టీడీపీ నాయకులు విమర్శించడం తగదన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు, నిషేధిత గంజాయి తరలింపు వంటి వాటిలో పట్టుబడిన వ్యక్తిని టీడీపీ నాయకులు పరామర్శించడం, బాలినేనిని విమర్శించడం విచిత్రంగా ఉందన్నారు. కనీస రాజకీయ విలువలు కూడా పాటించకుండా టీడీపీ నేతలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కుప్పం మండిపడ్డారు. ఆటలో అరటిపండు లాంటి గుప్తాను రెచ్చగొట్టి పావులా వాడుకుని అతని జీవితాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. అద్దంకిలో ఆర్య వైశ్యుడి ఇంట్లో చోరీ జరిగితే.. దానిని కూడా వైఎస్సార్ సీపీకి ముడిపెట్టడంపై టీడీపీని జనం అసహ్యించుకుంటున్నారని అన్నారు.

ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ మాట్లాడుతూ నేడు ఆర్యవైశ్యులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. బాలినేని ఎప్పుడూ ఎవరికీ హాని తలపెట్టలేదన్నారు. కానీ, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్ ఎక్కడి నుంచో వచ్చి విమర్శలు గుప్పిస్తూ ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. ఒంగోలు సూపర్‌బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్ మాట్లాడుతూ పోలీసుల సాధారణ తనిఖీల్లో పట్టుబడిన గుప్తా వ్యవహారంపై ఆందోళనకు ఒంగోలు చేరుకున్న రాకేష్.. అందుకు భిన్నంగా ఆర్యవైశ్యులను బెదిరించి డబ్బులు దండుకున్నారని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ఒంగోలు సూపర్‌బజార్ చైర్మన్ తాతా బదరీనాథ్ మాట్లాడుతూ గుప్తా చరిత్ర ఏమిటో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య సంఘాలకు తెలుసన్నారు. గుప్తా అరెస్టుపై ఆర్యవైశ్య సంఘంగానీ, మహాసభగానీ కనీసం ఒక్క ఖండన కూడా ఇవ్వలేదంటే.. అతని చరిత్ర ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆర్యవైశ్యులకు ఏ సహాయం అవసరమైనా పార్టీలకు అతీతంగా ఆదుకోవడం బాలినేనికి ఉన్న అలవాటని, అటువంటి వ్యక్తిపై బురద జల్లడాన్ని ఖండిస్తున్నామని తడవర్తి వాసు అన్నారు. విలేకరుల సమావేశంలో ఆరామ క్షేత్రం అధ్యక్షుడు కృష్టారావు, చిన్న, అమరా శ్రీను, మట్టా రాజా, రాంబాబు, కారంశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైసూరు వెళ్లి పెన్షన్ అందజేత



దివ్యాంగునికి మైసూరు వెళ్లి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ ఉమామహేశ్వరి

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడుకు చెందిన మహిళా వలంటీర్ దివ్యాంగునికి పెన్షన్ ఇచ్చేందుకు మైసూరు వరకు వెళ్లింది. మద్దిపాడుకు గ్రామానికి చెందిన సుద్దపల్లి రామకృష్ణ సంజయ్ అనే దివ్యాంగుడు చదువుల కోసం మైసూరు వెళ్లగా అతనికి పెన్షన్ తీసుకోవడానికి వీలు పడకపోవడంతో మహిళా వలంటీర్ మైసూరుకు వెళ్లి అక్కడ శనివారం పెన్షన్ అందించింది. వ్యయ ప్రయాసలకోర్చి మైసూరు వరకూ వెళ్లడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 5 రోజుల జైలుశిక్ష

ముండ్లమూరు: మద్యం తాగి వాహనం నడిపినందుకు వాహనదారుడికి ఐదు రోజులు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తిని శనివారం కోర్టులో పోలీసులు హాజరుపరచగా జడ్జి శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

గన్ లెక్క పక్కా!

- 13 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 36 తుపాకులు
- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తం
- రెండు రోజుల్లో గన్‌లన్నీ డిపాజిట్ చేయాలని పోలీసుల ఆదేశాలు

మార్కాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండటంతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మార్కాపురం, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం పోలీస్ సర్కిళ్ల పరిధిలో 13 పోలీస్ స్టేషన్‌లున్నాయి. హింసాత్మక సంఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రైవేట్ గన్ యజమానులపై దృష్టి సారించారు. భద్రత కారణాల దృష్ట్యా ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగే ప్రమాదం ఉందని పోలీసులు సంబంధిత యజమానుల నుంచి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. మొత్తం 36 ప్రైవేటు గన్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వ్యక్తిగతంగా గన్ లైసెన్స్ ఉన్న వారి వద్ద నుంచి గన్లను స్వాధీనం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సంబంధిత యజమానులకు పోలీస్ స్టేషన్‌లో వీటిని సరెండర్ చేయాలని నోటీసులు ఇచ్చారు. గతంలో పెద్దారవీడు మండలంలోని లోయ గ్రామాల్లో, గిద్దలూరు ప్రాంతంలో వన్యప్రాణుల వేటాడేందుకు కొంత మంది నాటు తుపాకులు ఉపయోగించిన సంఘటనలు జరగటంతో అటువంటి వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. గత ఎన్నికల్లో గొడవలు జరిగిన పెద్దారవీడు, అర్ధవీడు, కంభం, మార్కాపురం మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండటంతో ఆయా పోలింగ్ కేంద్రాలపై, గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వ్యక్తులపై దృష్టి పెట్టి బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి పలువురు అనుమానితులపై బైండోవర్‌లు చేస్తున్నారు. ఇందు కోసం ఎస్సైలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ మలికా గర్గ్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో మార్కాపురం సబ్ డివిజన్‌లో ప్రైవేటు తుపాకులు, నాన్ బెయిలబుల్ వారెంట్ల పెండింగ్, బైండోవర్ కేసులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశించటంతో పోలీస్ అధికారులు ఉరుకులు, పరుగులు మీద శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్టేషన్‌ల వారీగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించారు. డీఎస్పీ డాక్టర్ కిషోర్ కుమార్, పట్టణ, రూరల్ ఎస్సైలు శశికుమార్, సుమన్, పెద్దారవీడు ఎస్సై రాజేష్ తదితరులు రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానితులను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. రౌడీషీటర్లకు తమదైన శైలిలో కౌన్సెలింగ్ చేస్తున్నారు.

పశ్చిమాన గన్ కల్చర్

➤ పశ్చిమ ప్రకాశంలో గన్ కల్చర్ ఉంది. 2014లో పట్టణంలోని విద్యానగర్ సమీపంలో ఆటోడ్రైవర్ తన స్నేహితుడిని తుపాకీతో కాల్చి చంపాడు.

➤ ఇదే ఏడాది బేస్తవారిపేటలో ఒక వ్యాపారిని గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో బెదిరించారు.

➤ 2015లో జిల్లాకు చెందిన స్పెషల్ పార్టీ (మార్కాపురం) పోలీసులు నెల్లూరు జిల్లాలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో వ్యాపారిని బెదరించేందుకు తుపాకులను ఉపయోగించారు.



> **గన్లను డిపాజిట్ చేయాలని ఆదేశించాం:**
>
> 
>
> డివిజన్‌లో ఉన్న ప్రైవేటు తుపాకులన్ని రెండు రోజుల్లో డిపాజిట్ చేయాలని యజమానులను ఆదేశించాం. నిబంధనలను ఉల్లంఘించి దగ్గర ఉంచుకుంటే చర్యలు తీసుకుంటాం. అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.
>
> డాక్టర్ కిషోర్‌కుమార్: డీఎస్పీ

నాడు వైఎస్సార్ తీసుకున్న చర్య

నాకు నిజమైన సంతృప్తి



ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే కరణం, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వెంకయ్య, తదితరులు

- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ఒంగోలు: నల్లమలలో గిరిజనుల సంతానోత్పత్తి విషయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకున్న నిర్ణయం పూర్తి సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్సీ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఈ నెల 29వ తేదీతో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన జెడ్పీ సమావేశంలో విఠపును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రెండు దఫాలుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఒక దఫా పట్టభద్రుల ఎమ్మెల్సీగా పనిచేయడం జరిగిందన్నారు.

☛ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా నల్లమలలో గిరిజనుల సంతానోత్పత్తి 35 సంవత్సరాలకే నశిస్తున్న విషయాన్ని శాసనమండలి దృష్టికి గణాంకాలతో తీసుకెళ్లగా, వైఎస్సార్ స్పందించి గిరిజనులకు ప్రత్యేకమైన కిట్లు అందించారని గుర్తుచేశారు. అది తనకు చిరకాలం మరిచిపోలేని అనుభూతనిచ్చిందని అన్నారు. తనకు నల్లమలలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేయాలని ఉందని, అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. రాయలసీమ వాసులకు నోరుందని, నీరు లేదని, ఉత్తరాంధ్ర వారికి నీరుందని, నోరు లేదని అన్నారు. అయితే, ప్రకాశం జిల్లా వాసులకు ఆ రెండూ లేవన్నారు. శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల ప్రజలు విద్యారంగంలో విప్లవాత్మక ప్రగతి సాధిస్తున్న విషయాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం విఠపు బాలసుబ్రహ్మణ్యాన్ని ఘనంగా సత్కరించారు.

గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలి

- ఎస్పీ మలికాగర్గ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్



సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు

ఒంగోలు టౌన్: గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు అరికట్టేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టకష్టాల గురించి కళాశాల, హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం ఆమె మాట్లాడారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర మాదకద్రవ్యాలు వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. ఈ విషయాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఫ్లెక్సీల ద్వారా టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రచారం చేయాలన్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. మారుతున్న చట్టాలనుగుణంగా పోలీసు అధికారులు ఉద్యోగ నిర్వహణ చేయాలని, నూతన చట్టాల గురించి సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. 41 సీఆర్పీసీ అమలుపై పలు సూచనలు చేశారు. మహిళా పోలీసులు నిర్వహిస్తున్న విధులు, పనితీరుపై ఆరా తీసిన ఎస్పీ వారు సమర్థవంతంగా విధులు నిర్వహించేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

జిల్లాలో జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్స్‌ను బైండోవర్ చేయాలని, వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేయాలని, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రతలు తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు యు.నాగరాజు, నారాయణస్వామిరెడ్డి, కిషోర్ కుమారరెడ్డి, దిశ డీస్పీ పల్లపు రాజు, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో మంటలు

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున గల ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది. నగరంలోని మంగలపాలెంలో పార్వతమ్మ గుడి దగ్గర గల జాస్మిన్ క్రిస్టల్ లైట్స్ దుకాణం యజమాని షేక్ సికిందర్ శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 12.45కు దుకాణం నుంచి దట్టంగా పొగలు రావడాన్ని గుర్తించిన కొందరు యువకులు భవన యజమాని తిరుమర్ల చంద్రారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే దుకాణం యజమాని సికిందర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. షాపులోని సామగ్రితో పాటు సీలింగ్, ఫర్నిచర్, ఏసీ పరికరాలు దగ్ధం అయ్యాయి. షాపు ముందు భాగాన ఏర్పాటు చేసిన గ్లాసు డోర్ పెద్ద శబ్దం చేస్తూ పగిలిపోయింది. మంటలు భారీగా చెలరేగడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మంటలు అదుపులోకి రాక పోవడంతో ఒంగోలులో ఉన్న మరో ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చినా అది మొరాయించింది. దీంతో టంగుటూరు నుంచి తెప్పించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్.వేణుగోపాల రెడ్డి పర్యవేక్షణలో ఒంగోలు ఏడీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, టంగుటూరు ఏడీఎఫ్ఓ రమణారెడ్డి, రెస్క్యూ టీం సభ్యులు పాల్గొన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. సమారు రూ. 35 లక్షల విలువ చేసే సరుకు ఉందని, ఇటీవలే 10 లక్షల రూపాయలతో చేయించిన ఫర్నిచర్‌తో పాటు క్యాష్ ఆహుతై పోయిందని బాధితుడు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- కౌంటింగ్, స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్ట భద్రత
- ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ, జేసీ, ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరగాలని, అందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ప్రకాశం భవనంలో ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై శనివారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌తో పాటు తాత్కాలిక స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్‌ల వారీగా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీ డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, ఆయా సెంటర్లలో విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. జోనల్ అధికారులు జోనల్‌లో పర్యటిస్తూ పోలింగ్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పీఓలు, ఏపీఓలకు ఈ నెల 9వ తేదీ రెండో విడత శిక్షణ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించారు. డివిజన్‌లలో ఓటర్ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు 8వ తేదీ లోగా కలెక్టర్ కార్యాలయంలో అందజేస్తారని, పూర్తి చేసిన బ్యాలెట్‌ను కవర్‌లో ఉంచి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో 15వ తేదీ లోగా అందజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్ఓ చిన ఓబులేసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

విశాఖ సమ్మిట్ విజయవంతం



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 విజయవంతం కావడంతో పాటు రాష్ట్రంలో సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జాతీయ స్థాయిలో క్రేజ్ పెరిగిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. విశాఖ సదస్సుతో రాష్ట్రంలోని ఆరు లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. దేశంతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు నచ్చి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రధానంగా ఐటీ, పరిశ్రమలు, పర్యాటకం, ఇంధన రంగం, తదితర వాటిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు సుముఖత వ్యక్తం చేశారన్నారు. రాష్ట్రంలో ఉన్న అపారమైన సహజ వనరులను ముఖ్యమంత్రి ఇన్వెస్టర్లకు వివరించడంతో వారు ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపుతున్నారన్నారు. దీని వల్ల రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి ప్రతిఒక్కరూ మద్దతివ్వాలని జంకె కోరారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి...

ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న చంద్రశేఖరరెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని జంకె వెంకటరెడ్డి కోరారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గమనించి పట్టభద్రులు ఉపాధ్యాయులు వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, మండల, గ్రామ అధ్యక్షులంతా చంద్రశేఖర్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

పొలం వివాదంలో ఘర్షణ

- ఆరుగురికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు



సంఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు

అర్థవీడు (కంభం): పొలం వద్ద ఏర్పడిన వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణగా మారి పరస్పరం దాడులు చేసుకోవడంతో నలుగురికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని పోతురాజుటూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం మధ్యాహ్నం గన్నేపల్లి ఇలాఖాలో వివాదంలో ఉన్న పొలాలను పరిశీలించేందుకు వెళ్లారు. పొలాల హద్దుల పరిశీలించిన అధికారులు రికార్డులు పరిశీలించి త్వరలో కచ్చితమైన హద్దులు చూపిస్తామని చెప్పి వచ్చారు. అధికారులు వెళ్ళిన కొద్దిసేపటికే అక్కడ ఉన్న రెండు వర్గాల వారు దాడులకు దిగాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కటికల రాజారత్నం, కటికల చంద్రశేఖర్, రవిబాబు, జయప్రకాశ్‌రావుకు తీవ్రగాయాలు కాగా ప్రాథమికి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మరోవర్గానికి చెందిన బాలయ్య, రమణకు గాయాలు కాగా వారు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపారు.



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం